క్లుప్తంగా

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం గురుదక్షిణామూర్తికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో మొక్కులు చెల్లించారు.

ఈవోను కలిసిన ఉభయదారులు



ఈవోతో ఉభయదారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పెండ్లిమండపం ఉభయదారులు, కైకాల, సెంగుధర్ కళవెళ్లత్తూరు మరబినర్ సంఘం వారు గురువారం ఈవోను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఈవో సత్కరించారు.

ఈఎస్ఐ అనుమతులు ఇవ్వాలని వినతి



మంత్రి సుభాష్‌కు ప్రసాదాలు అందజేస్తున్న మయూర్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రికి ఈఎస్ఐ అనుమతులు మంజూరు చేయాలని ఆస్పత్రి డైరెక్టర్ మయూర్ కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కోరారు. ఆయనను తిరుపతిలో మర్యాద పూర్వకంగా కలిసి ముక్కంటి ప్రసాదాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తమ ఆస్పత్రి పరిధిలో 30 పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. వాటిలో సుమారు 20 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వారికి ఈఎస్ఐ సేవలు ఎంతో అవసరమన్నారు. అందుకు తమ ఆస్పత్రికి అనుమతి ఇవ్వాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి అనుమతి ఇప్పిస్తామని, త్వరలో ఆస్పత్రిని సందర్శిస్తానని తెలిపారు.


కళాశాలకు ప్రింటర్ వితరణ



ప్రింటర్ అందజేస్తున్న చెంచుకృష్ణారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల జూనియర్ కళాశాలకు విశ్రాంత అధ్యాపకులు చెంచుకృష్ణారెడ్డి గురువారం ప్రింటర్ వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ తాను పనిచేసిన కళాశాలకు ఏదో ఒక రూపంలో సాయం చేయాలనే ఉద్దేశంతో రూ.30 వేల విలువైన ప్రింటర్ అందజేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ



విద్యార్థినికి కళ్లజోళ్లు తొడుగుతున్న ఆదిమూలం

నారాయణవనం: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా 138 మంది పాఠశాల విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అందజేశారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మండల వైద్య శాఖ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్, జిల్లా ప్రోగ్రామింగ్ మేనేజర్ మధుబాబు, మండల వైద్యాధికారి దర్శిత్ రాజు, డిప్యూటీ డీఈఓ ప్రభాకర్‌రాజు, ఎంపీడీఓ గుణశేఖర్, హెచ్‌ఎం శశికళ, ఈఓ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పటిష్టతకు కృషి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ సమన్వయ కర్త తలపా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో శబరి, కరీముల్లా, భాస్కర్, చిరంజీవినాయక్, రాహుల్, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో తాగునీటి కష్టాలు

తిరుపతి విమానాశ్రయం అంతర్జాతీయ స్థాయికి ప్రమోట్ అయింది. రోజూ పదుల సంఖ్యలో విమానాలు నడుస్తున్నాయి. వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వీఐపీలు, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు వస్తూ ఉంటారు. వారిని రిసీవ్ చేసుకునేందుకు అధికారులు, ప్రజలు వస్తుంటారు. అక్కడ గుక్కెడు మంచినీరు దొరకడం లేదు. విమానాశ్రయ అధికారులు తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో దుకాణాల్లో వాటర్ బాటిళ్లు కొనుగోలు చేయాల్సి వస్తోంది.



- రోజూ వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు
- 130 మందికి పైగా పనిచేస్తున్న కార్మికులు, ట్యాక్సీల డ్రైవర్లు
- గుక్కెడు నీరు దొరక్క అవస్థలు
- వాటర్ బాటిలు కొనుగోలు చేయాల్సిన దుస్థితి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో నిత్యం వీఐపీల తాకిడి ఎక్కువగా ఉంటోంది. వీఐపీల ప్రొటోకాల్ డ్యూటీలో వందలాది మంది అధికారులు, పోలీసులు విమానాశ్రయం వెలుపల ఉండాల్సిన పరిస్థితి. వారు కాకుండా తమ వాళ్లను రిసీవ్ చేసుకునేందుకు రోజూ వందల సంఖ్యలో ప్రయాణికుల సంబంధీకులు వస్తుంటారు. విమానాశ్రయంలో పలు విభాగాల్లో సుమారు 130 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. వారికితోడు ట్యాక్సీలు, జీపులు, కార్ల డ్రైవర్లు ఉన్నారు. విమానాశ్రయం ఆవరణలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకు వ్యాల్యూ కాఫీ షాప్ కౌంటర్‌లో లీటర్ వాటర్ బాటిల్ రూ.30లు పెట్టి కొనుగోలు చేయాల్సిన దుస్థితి. వేసవికాలం సమీపిస్తున్న తరుణంలో అనేక ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రపంచ ప్రఖ్యాతగాంచిన తిరుపతి విమానాశ్రయం ఆవరణలో నీటి సౌకర్యం లేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.



విమానాశ్రయ ఆవరణంలో వేచి ఉన్న వాహనాలు

డ్రైవర్ల కష్టాలు వర్ణనాతీతం

ప్రయాణికుల కోసం అనునిత్యం సుమారు 500 వాహనాలు విమానాశ్రయాల్లోకి వస్తుంటాయి. విమానాశ్రయం ఆవరణలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.30 వెచ్చించి నీరు కొనలేక, తాగడానికి నీరు దొరక్క అవస్థలు పడుతున్నారు. అలాగే విమానాశ్రయాన్ని నమ్ముకుని ట్యాక్సీలు నడుపుకుంటున్న 130 మంది డ్రైవర్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండాల్సిన పరిస్థితి. ఉదయం వాటర్ బాటిల్‌లో నీరు తెచ్చుకుని సాయంత్రం వరకు అదే నీటిలోనే కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి. ఈ విషయాన్ని బయటకు చెబితే విమానాశ్రయ అధికారులు తమను ఇబ్బందులకు గురిచేస్తారేమోనన్న భయంతో వారు బాధను దిగుమింగుతున్నారు.

చిన్న స్థాయి అధికారుల వేదన...

అంతర్జాతీయ విమానాశ్రయానికి నిత్యం అనేక మంది వీవీఐపీలు, వీఐపీలు, కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులు వస్తుంటారు. వారికి ప్రొటోకాల్ డ్యూటీగా చిన్న స్థాయి ఉద్యోగులను నియమిస్తుంటారు. అందరికీ విమానాశ్రయం లోపలికి వెళ్లేందుకు పాసులు ఉండవు. విమానాశ్రయం వెలుప వేచి ఉండాలి. వారికీ తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇకనైనా విమానాశ్రయ అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

శివరాత్రికి విస్తృత ఏర్పాట్లు

నారాయణవనం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనలో విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆలయ ఈఓ కృష్ణనాయక్ తెలిపారు. గురువారం కైలాసనాథకోనలోని దేవదాయశాఖ అతిథి గృహంలో స్థానికులతో సమావేశాన్ని నిర్వహించారు. కృష్ణనాయక్ మీడియాతో మాట్లాడుతూ బుధవారం శివరాత్రి సందర్భంగా అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తులు, పర్యాటకులకు భక్త మండలితో రెండు రోజులపాటు నిర్విరామంగా అన్నప్రసాదాల వితరణ ఏర్పాటు చేశామని అన్నారు. రాత్రి మేల్కొనే భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వాహనాలకు ఏపీ టూరిజం అతిథి గృహం, కోన నడక దారిలో పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. గురువారం కామాక్షాంబిక, కైలాసనాథుల కల్యాణోత్సవ సందర్భంగా కైలాసనాథకోనలో వివాహాలకు అనుమతులు లేవని అన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. శివరాత్రి సందర్భంగా త్రికాల అభిషేకాలు, స్వామి కల్యాణంలో పాల్గొనే భక్తులు ఆలయ సిబ్బంది లేదా అర్చకులను సంప్రదించాలని కృష్ణనాయక్ తెలిపారు.

ఆటో బోల్తా పడి మహిళకు గాయాలు



బోల్తాపడిన ఆటో

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలంలోని గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ సమీపంలో గురువారం సాయంత్రం ఆటో బోల్తా పడి మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి వైపు నుంచి తిరుపతి వైపు వెళుతున్న ఆటో టైర్ పంచర్ కావడంతో అదుపుతప్పి పక్కనున్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న మహిళ తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అమ్మభాషకు అక్షర ఆకృతి



కల్లివెట్టు అ... అక్షర ఆకృతిలో విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో గురువారం పాఠశాల విద్యార్థులు అ... అక్షర ఆకృతిలో తెలుగు భాషాభిమానం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియంతలా బొజ్జల సుధీర్ రెడ్డి

- కక్ష సాధింపు ధోరణితో కడుపులు కొడుతున్నారు
- టీడీపీ మహిళా నాయకురాలు చక్రాల ఉషా ఆవేదన

శ్రీకాళహస్తి :''ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఓ నియంతలా వ్యవహరిస్తున్నాడు'' అని తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు చక్రాల ఉషా అన్నారు. నారా లోకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా సమావేశానికి వెళ్లినందుకు, బొజ్జల సుధీర్ రెడ్డికి ఎదురు తిరిగినందుకు మున్సిపల్ అధికారులు తన భర్తకు చెందిన లైనర్స్ దుకాణాన్ని కూల్చేస్తామంటూ బెదిరిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. . బుధవారం నారా లోకేష్ తిరుపతి పర్యటనలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి, తనకు వాగ్వాదం చోటు చేసుకున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు రాత్రికి రాత్రే ఈ దారుణానికి ఒడిగట్టారని ఆమె వాపోయారు. ఆ దుకాణం అక్రమంగా నిర్మించుకున్నారని, వారం రోజుల్లో తొలగించాలంటూ జనవరి 13న నోటీసు జారీ చేసినట్లుగా ఫిబ్రవరి 19న మున్సిపల్ అధికారులు తెలిపారన్నారు. తన మామ చక్రాల నాగయ్య గత 40 ఏళ్లుగా నాగులగుంట సర్వే నెం.261, ఇంటి నెం.6-605లో ట్రాక్టర్ లైనర్స్ దుకాణం నడుపుతున్నట్లు చెప్పారు. అందుకు సంబంధించి పన్ను, కరెంట్ బిల్లు కూడా కడుతున్నట్లు గుర్తు చేశారు. ఇదంతా కక్ష పూరితంగా జరుగుతోందని, మున్సిపల్ అధికారుల తీరుకు వ్యతిరేకంగా న్యాయపోరాటం చేస్తానని ఆమె తెలిపారు. శ్రీకాళహస్తి మున్సిపల్ అధికారుల తీరు నానాటికీ దారుణంగా ఉందని, పారదర్శకంగా వ్యవహరించాల్సిన వారు రాజకీయ నాయకుల చేతుల్లో బొమ్మలుగా మారి ప్రవర్తిస్తున్నారని ఆమె ఎద్దేవా చేశారు. తనపై లేనిపోని అభాండాలు వేసి దుష్ప్రచారం చేస్తున్నారని, తాను తప్పు చేసినట్టు నిరూపిస్తే నడి వీధిలో ఉరేసుకోవడానికి సిద్ధమన్నారు. సొంత పార్టీలో ఉన్న ఆమెకే ఈ పరిస్థితి ఉంటే ప్రతిపక్షంలో వారి పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థమవుతుంది.

భక్తులకు నిస్వార్థంగా సేవలందించండి



మాట్లాడుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ నిస్వార్థంగా సేవలందించాలని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి కోరారు. పట్టణంలోని సరస్వతిబాయి పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో గురువారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కెప్టెన్లకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో శకుంతలమ్మ, ధనలక్ష్మి, కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబు, కోటేశ్వరరావు, మునిరత్నం, అజారుద్దీన్, సతీసావిత్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభతో కళాశాలలకు గుర్తింపు



బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: కళాశాలలో చదువుతున్న విద్యార్థులు సాధించే మార్కులు, క్రీడాపోటీల్లో అవార్డులే కళాశాలకు జిల్లా, రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకువస్తుందని ఎంఈఓ కె.రవి అన్నారు. గురువారం బాబు జూనియర్ కళాశాల 15 వార్షికోత్సవ వేడుకలు మస్తాన్ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ-2 ఉషా, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.భారతి, మాజీ జడ్పీ చైర్మన్ కె.సుందరరామి రెడ్డి, కరస్పాండెంట్ పరంధామ, మాస్టర్‌స్కూల్ చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, పళణి, మునివేలు, భాస్కర్, ఈశ్వర్, అపర్ణ, భానుప్రియ, దీప, ప్రియాంక, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): మహాశివరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తిలో జరిగే శివపార్వతుల కల్యాణోత్సవంలో బాల్య వివాహాలు జరగకుండా నియంత్రించాలని ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు కోరారు. వారు గురువారం రేణిగుంట మండలం గుత్తివారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో రంగనాథన్ మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, హెచ్‌ఎం పురుషోత్తం, మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ మంజూష, క్లస్టర్ కోఆర్డినేటర్ సుభాష్ చంద్రబోస్, సీవో రాజేశ్వరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రంగా పి4 సర్వే



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: పి4 సర్వే సమగ్రంగా నిర్వహించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పి4 సర్వే(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్ షిప్ సర్వే) పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీలలో బాగా ఆర్థికంగా ఉన్న వారు 10 శాతం, 20 శాతం నిరుపేద కుటుంబాలను గుర్తించి వారి జీవన పరిస్థితుల వివరాలు సేకరించాలన్నారు. శిక్షకులు ఎ.శ్రీధర్ మాట్లాడుతూ మార్చి 31 లోపు సర్వే పూర్తి చేయాలని కోరారు. సచివాలయ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

మసూరా బియ్యమని మోసం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలంలో గురువారం కొంతమంది ఇళ్ల వద్దకు వచ్చి మసూర బియ్యమని రేషన్ బియ్యం విక్రయించారు. బాధిత మహిళల కథనం మేరకు.. వెంకటాపురం పంచాయతీ అల్లిమిట్టలో గురువారం ఒక వ్యక్తి ఆటోలో బియ్యం తీసుకుని వచ్చాడు. మసూరా బియ్యం 25 కేజీల బస్తా రూ.1100లకే ఇస్తున్నట్లు తెలిపారు. అతని మాటలు నమ్మిన మహిళలు 7 బస్తాలు కొనుగోలు చేశారు. ఇంటికి వెళ్లి బస్తాలు విప్పి చూడగా రేషన్ బియ్యం ఉండటంతో మోసపోయామని గ్రహించారు. నగదు ఫోన్ పే చేసిన నంబర్‌కు ఫోన్ చేయగా సమాధానం లేదు. దీంతో వారు రేణిగుంట పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు విచారించి చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీలతో భవిత

సత్యవేడు: అంగన్‌వాడీ కేంద్రాలు బాలల భవితకు సోపానాలని సీడీపీఓ దేవకుమారి అన్నారు. గురువారం బాలుర ఉన్నత పాఠశాలలో జ్యానజ్యోతి రెండో విడత శిక్షణ కార్యక్రమం జరిగింది. సీడీపీఓ మాట్లాడుతూ మెరుగైన బోధన అందిస్తామనే నమ్మకాన్ని తల్లిదండ్రులకు కలిగించినపుడే కేంద్రాలలో చిన్నారుల సంఖ్య పెరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయిని కె.భారతి, రిసోర్సు పర్సన్లు బాలకృష్ణ, జయమణి, గుణశేఖర్, సూపర్‌వైజర్ ఎస్.భజావతి, ఎం.జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూకతోటి రాజేష్ పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

నాగలాపురం: సత్యవేడు నియోజకవర్గ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్ఆర్ సీపీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో నూకతోటి రాజేష్ కేక్ కట్ చేసి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డి, సునీత, ఎల్.సు రేష్, ధనరాజ్,హరిబాబు, శ్రీనివాసులు, ఏలుమలై, రాజ, దేశన్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఎన్‌కండ్రికలో..

బుచ్చినాయుడుకండ్రిగ: వైఎస్ఆర్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ జన్మదినోత్సవాన్ని గురువారం బుచ్చినాయుడుకండ్రిగలో మణినాయుడు ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేసి, ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలను పంచిపెట్టారు. వైఎస్ఆర్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మణినాయుడు, రవిరెడ్డి, గురునాథం, నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, దేవదాసురెడ్డి, గురవయ్య, కోటేశ్వరరావు, ప్రసాద్‌పాల్, జయచంద్రనాయుడు, సముద్రాల అశోక్, శివ, కిరణ్‌యాదవ్, వెంకటేష్, నాగూర్, సంజీవయ్య, హేమంత్, ప్రసాద్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



బుచ్చినాయుడుకండ్రిగలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ

సత్యవేడులో.

సత్యవేడు: వైఎస్ఆర్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గురువారం మూడు రోడ్ల కూడలి లోని వైఎస్ఆర్ విగ్రహం సమీపంలో కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంపిపెట్టారు. నాయకులు రమేష్, మస్తానీ, ఎంపీ రవి, పళణి, గోపాల్ రెడ్డి, దయాళన్, పునిదకుమార్, శ్రీనివాసులురెడ్డి, రాబర్టు, సోము, మునివేలు, ఆనంద్, రాబిన్, శివ, రాము, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సత్యవేడులో కేక్ కటింగ్

అర్థమయ్యేలా బోధన

బుచ్చినాయుడుకండ్రిగ: అంగన్ వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు అర్థమయ్యే విధంగా బోధించాలని ఎంఈఓ మునిసుబ్రమణ్యం సూచించారు. గురువారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, సూపర్‌వైజర్ యమున తదితరులు పాల్గొన్నారు.



టీఎల్ఎం మెటీరియల్‌ను చూపుతున్న కార్యకర్తలు

మహిళలు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి: తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో తొట్టంబేడు మండలం కాసరం పీహెచ్‌సీ పరిధిలోని చియ్యవరంలో గురువారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్టు డాక్టర్ మాధవుడు తెలిపారు. ఇందులో పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలతో పాటు మహిళలకు రొమ్ము, నోటి క్యాన్సర్ పరీక్షలు చేశారు. అదే విధంగా బోనుపల్లిలో కూడా వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నలభై ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు కార్యక్రమంలో వైద్యులు లహరి, పద్మావతి, చైతన్యభాను, ఎంపీటీసీలు వేమాలయ్య, రవీంద్రనాయుడు, సర్పంచులు సిద్దయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.